ప్రజాశక్తి

మంగళవారం 15 జులై 2025

5

అల్లూరి సీతారామరాజు

ఆసుపత్రి సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఎం. నీలవేణి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. సుదూర ప్రాంతాల నుండి ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎల్లప్పుడూ నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని నీలవేణి తెలిపారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలను ఇంద్ర ప్రియాంక సుమారు ఐదు నెలల పాటు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు వాసవి శ్రీలత, సంతోష్ కుమార్, చందన, అనూష, భారతి, రుక్మిణి, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజారావు, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్ పాల్గొన్నారు.

అభినందిస్తున్న వైద్యులు

కొండ మార్గంలో నడిచి వెళుతున్న విద్యార్థులు

కొండల నడుమ పాఠశాలకు..!

ఎనిమిది కిలోమీటర్లు కాలినడకన వెళుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- అనంతగిరి: చదువుకై పాఠశాలకు వెళ్లాలంటే ఎత్తైన కొండలు నడుమ దట్టమైన అటవీ ప్రాంతం మీదుగా దిగువ ప్రాంతంలో ఉన్న పాఠశాలకు రానుపోను ఎనిమిది కిలోమీటర్ల దూరం కాలినడకన ప్రయాణం కొనసాగించవలసిన పరిస్థితి నెలకొంది. మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధి బూసిపాడు, టెంకబుడ్డి గ్రామాలకు చెందిన 11 మంది విద్యార్థుల కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. నిత్యం ఈ విధంగా రాకపోకలు సాగించావలసిన దుస్థితి నెలకొంది. గ్రామంలో కనీసం పాఠశాల లేకపోవడంతో ఆ రెండు గ్రామాలకు చెందిన విద్యార్థులు కొత్తూరు పాఠశాల ఏర్పాటు చేసినప్పటి నుండి నిత్యం ఈ అటవీ ప్రాంతం మీదుగా చదువు కోసం వెళుతున్నారు. వర్షాకాలంలో

విద్యార్థులు పాఠశాలకు వెళ్లే పరిస్థితి ఉండదు. విద్యార్థులను ఉదయం, సాయంత్రం తల్లిదండ్రులు గ్రామం నుండి పాఠశాలకు చేర్చవలసి వస్తోంది. అటవీ ప్రాంతం కావడంతో విద్యార్థులపై ఎటువైపు నుండి విషపూరితమైన జంతువులు దాడి చేస్తాయోననే భయాందోళన తల్లితండ్రులకు నెలకొంది. గ్రామానికి- శివలింగపురానికి మార్గమధ్యలో రైల్వే ట్రాక్ ఉంది. ఈ ట్రాక్‌ను దాటి విద్యార్థులు వెళుతున్నారు. ఈ ట్రాక్ దాటుతున్న సమయంలో ఎటువైపు నుండి ట్రైన్ వస్తుందోననే భయంతో విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి బూసిపాడు గ్రామంలో ప్రత్యామ్నాయ పాఠశాలను ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు

గంజాయితో భవిష్యత్తు నాశనమే

-పాడేరు సిఐ డి.దీనబంధు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: విద్యార్థులు, యువత గంజాయి జోలికి వెళితే భవిష్యత్తు నాశనమేనని, ఏజెన్సీ ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి మహమ్మారిని తరిమికొట్టాలని పాడేరు సిఐ డి.దీనబంధు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కాఫీ హౌస్‌లో గంజాయి అనర్థాలపై ఆదివాసి గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి బాలదేవ్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత, కొంతమంది విద్యార్థులు గంజాయికి అలవాటు పడి భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని ఈ సందర్భంగా సిఐ వివరించారు. ఏ పరిస్థితుల్లోనూ గంజాయి జోలికి వెళ్లొద్దని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని కోరారు. గంజాయి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ, గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, డబ్బును ఆశ చూపి గంజాయి పనులకు గిరిజనులకు పావులుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. ఆదివాసీల ఐక్యతను చెడగొట్టేందుకు కొంతమంది కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఇటువంటి ధోరణిని విద్యార్థులు గ్రహించి బయటకు రావాలని కోరారు. గిరిజన ప్రాంతంలో ప్రత్యామ్నాయ పంటల ద్వారా ఆదివాసీలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఐటిడిఎ ద్వారా చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకమైన నిధులు, ఎస్ టి సబ్ ప్లాన్ నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. . ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.ధర్మాన పడాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్, జీవన్, 500 మంది విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ దీనబంధు, వేదికపై అజశర్మ, తదితరులు

పేదరికం లేని సమాజాన్ని నిర్మించాలి

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం ఆశయాల మేరకు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని పేదరికం లేని సమాజాన్ని నిర్మించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. పీ 4 విధానం అమలుపై సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఆర్థిక సహాయ మాత్రమే కాదు విద్య, వైద్య రంగాలలో సహాయం అందించాలని చెప్పారు. ఉపాధ్యాయులు బంగారు కుటుంబాల విద్యార్థులను దత్తత తీసుకోవాలని సూచించారు. అభివృద్ధికి తోడ్పాటు అందించాలని స్పష్టం చేసారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందించి పేదరిక నిర్మూలనకు కృషి చేయాలాన్నరు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వోద్యోగులు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, కాంట్రాక్టరులు పేదరిక నిర్మూలనకు తోడ్పాటు అందించాలని చెప్పారు. పీ 4 సర్వేకు మండల స్థాయిలో కమిటీలను నియమించామన్నారు. కమిటీలు సక్రమంగా సర్వే చేసి బంగారు కుటుంబాలను గుర్తించి ధృవీకరించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ఎం. జె.అభిషేక్ గౌడ, ఐటిడిఏ పిఓలు, కె. సింహచలం, అపూర్వ భరత్, సిపిఓ పి.ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి విశ్వేశ్వరనాయుడు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్ పాల్గొన్నారు.

పీ4 సర్వేపై 15 నుండి పున్ణధృవీకరణ

పాడేరు: పేదరికం లేని సమాజ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర పీ 4 సర్వేపై జిల్లాలో ఈ నెల 15 వ తేదీన నుండి 25 వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పున్ణధృవీకరణ సర్వే ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశాలు జారీ చేసారు. ఈ మేరకు ఈనెల 11 వతేదీ ఒక మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేసామని సోమవారం ఒక ప్రకటనలో తెలియ జేసారు. కమిటీ సభ్యులు గ్రామ, వార్డు స్థాయిలో పర్యటించి గత మార్చి నెలలో జరిగిన పీ 4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాల పరిశీలించిన జాబితాను పున్ణపరిశీలన చేయాలని ఆదేశించారు. అనంతరం జాబితాను సంబంధిత గ్రామ సచివాలయం, పంచాయతీ కార్యలయాలలో ప్రచురించాలని ఆదేవించారు.

ర్యాలీ చేపడుతున్న నాయకులు

రోడ్డు వెడల్పు పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-పెదబయలు: మండల కేంద్రంలో తక్షణమే రోడ్డు వెడల్పు పనులు వేగవంతం చెయ్యాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన సోమవారం ర్యాలీ చేపట్టారు. స్థానిక తహసీల్దార్ జి.రంగారావుకు గిరిజన సంఘం పూర్వ అధ్యక్షులు సన్నిబాబు, ఎంపీపీ వరహాలమ్మా, సర్పంచి పి,మాధవరావు, ఎంపీటీసీ కె.బొంజుబాబు వైస్ సర్పంచ్ బి గంగాధరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కు వినతి పత్రం ఇచ్చారు. మెయిన్ రోడ్డు వెడల్పు విషయం లో రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు.రోడ్డు ఇరుకుగా ఉండటంతో ప్రతి క్షణం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి తరచు ప్రమాదాలు జరుతున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు గిరిజ నేతరులు ఆక్రమించుకొని చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేసారు, ఈ కార్యక్రమంలో ఎంపీపీ వరహాలమ్మా, సర్పంచ్ పి,మాధవరావు, ఎంపీటీసీ కె బొంజుబాబు, వైస్ సర్పంచ్ గంగాధరం, మాజీ ఎంపీటీసీ చిన్నతల్లి, జగత్ రాయ్ పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లు పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: సీపీఫ్ స్వచ్ఛంధ సంస్థ అధ్వర్యాన గిరి రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణి చేశారు. పనిముట్లతో వ్యవసాయ అభివృద్ధికి తోడ్పాటు నిచ్చుకోవాలని ఎంపీపీ ఈశ్వరి అన్నారు. సేంద్రియ పద్ధతిలో పంటల సాగుకు ఊతమిస్తే అధిక దిగుబడులు సాధ్యపడుతుందన్నారు. ఎంపీడీఓ ప్రేమ్ సాగార్ మాట్లాడుతూ, సంస్థ సహకారంతో పనిముట్లను వినియోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. గిరిజన రైతులకు గాలి పంకాలు, గడ్డీ తీసే యంత్రాలు, డిజిటల్ తూకం, ప్రకృతి వ్యవసాయానికి వినియోగంగా ఉండే స్పేయింగ్లను తూటంగి, లైగండ, గుంటగన్నెల పంచాయతీల 20గ్రామాల గిరిజన రైతులకు పంపిణీ చేశారు. జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, ఆ సంస్థ ప్రతినిధులు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

పనిముట్లను ఇస్తున్న ఎంపిపి

ఘనంగా ఉత్సవం

ప్రజాశక్తి పాడేరు:- ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం శాఖంబరి మహెూత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ రకములైన కూరగాయలతో అలంకరణ, దర్శనముకు విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద కార్యక్రమము, ప్రసాదము పాలు పంపిణీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి నర్సింగరావు, ఆలయ ధర్మకర్త కొట్ట గల్లి సింహాచలం నాయుడు రమాదేవి మహిళలు అత్యధికంగా పాల్గొన్నారు.

ముంపువాసుల వెతలు

ఎత్తైన ప్రాంతాల్లో గుడారాలు ఏర్పాటు

ప్రజాశక్తి-విఆర్.పురం

వర్షా కాలం ప్రారంభం కావడంతో ఎప్పుడు గోదావరి పొంగి తమను ముంచుతుందోనని పోలవరం ముంపు ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు భద్రాచలం దగ్గర శనివారం 41.4 చేరిన గోదావరి, శబరి నదులు తరువాత తగ్గు ముఖం పట్టి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు 23.3 అడుగులకు చేరింది. దీంతో ముంపు గ్రామాల ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నా ఎప్పుడు వరద ముంపు ముంచెత్తుతుందోనని భయపడుతున్నారు. ప్రతి ఏటా వరదల సమయంలో ముంపు గ్రామాల ప్రజల బతుకులు ఛిద్రమవుతున్నాయి. వరద ముంపు వస్తే గ్రామాల నుండి ఎత్తైన ప్రాంతాలకు తరలివెళ్లడం అనివార్యం. ఈ కారణంగా ముంపు గ్రామాల ప్రజలు ఎత్తైన ప్రాంతాల్లో గుడారాలను సిద్ధం చేసుకుంటున్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మించడం ముఖ్యమే అయినప్పటికీ ఆ ప్రాజెక్టు వల్ల నిర్వాసితులుగా మారుతున్న ప్రజల వెతలు మాత్రం ఏ పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రాజెక్ట్ కాపర్ డ్యాం కారణంగా అతి తక్కువ వరద నీరు గోదావరితో చేరినా గ్రామాల్లోకి ముంచెత్తుతుంది. గతంలో వరద వస్తే ఇలా ఊర్లను విడిచి వెళ్లాల్సి వచ్చేది కాదు. కాపర్ డ్యామ్ నిర్మాణంతో ముంపు తీవ్రత పెరిగి 20 రోజుల వరకు ముంపులోనే ఉండాల్సిన దుర్భర స్థితి నెలకొంది. ప్రభుత్వాలు ముందు ప్రాజెక్ట్ కారణంగా నిర్వాసితులవుతున్న ప్రజలకు పునరావాసం, ప్యాకేజీ, అన్ని వసతులు కల్పించి గ్రామాలను ఖాళీ చేయించిన తరువాత మాత్రమే ప్రాజెక్టు నిర్మించాల్సి ఉన్నప్పటికీ చట్టాన్ని పక్కన పాలకులు ముందు ప్రాజెక్టును నిర్మించడం వలన ప్రతి సంవత్సరం వరద ముంపునకు ప్రజలు గురవుతూనే ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పునరావాసం, ప్యాకేజీ, పురవాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని పోలవరం నిర్వాసితులు కోరుతున్నారు.

ఎత్తైన ప్రాంతంలో గుడారాల ఏర్పాటుకు కర్రలను సిద్ధం చేసిన నిర్వాసితులు

పాఠశాల భవనం నిర్మించాలని ఆందోళన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని చికిలింత పంచాయతీ, కరుదేవిపాలెం గ్రామంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం తొలగించి, కొత్త భవనం నిర్మించాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కోండ్ల సూరిబాబు ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కోండ్ల సూరిబాబు మాట్లాడుతూ ఈ పాఠశాలలో ఒకటి నుండి ఐదు వరకు 35 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి స్లాబు పెచ్చులు ఊడి పడుతున్నాయని, గోడలు బీటలువారి కూలిపోవడానికి సిద్ధంగా ఉందని, వర్షం వస్తే వర్షపునీరు పాఠశాల గదిలోకి చేరి విద్యార్థులు చదువుకోలేని స్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు- నేడులో పాఠశాల భవనం నిర్మిస్తామని చెప్పినప్పటికీ నేటికి ఆ ప్రక్రియ జరగలేదన్నారు. ఈ కూటమి ప్రభుత్వం, అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వంచంగి పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో ఉన్న జిపిఎస్ పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతుండగా, వారిలో ఒకటి రెండు తరగతుల విద్యార్థుల అక్కడ ఉంచి, మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను వాతంగి ఆశ్రమ పాఠశాలకు తరలించి టీసీలు కూడా ఇచ్చారని తెలిపారు. తమ పిల్లల్ని అక్కడికి పంపించేది లేదని, ఇదే పాఠశాలలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, ఎంఈఓ-1 కేవివి సత్యనారాయణదొర, ఎంఈఓ-2 సూరయ్య రెడ్డిలకు వినతి పత్రాలు అందజేశారు.

దీనికి స్పందించిన ఎంఇఒ సత్యనారాయణ దొర పాఠశాల భవనం పరిస్థితి ఇప్పటికే అధికారులకు నివేదించినట్లు తెలిపారు. కొత్తపల్లి పాఠశాలలో పిల్లలను తరలించకుండా ఉండేలా అధికారులకు నివేదిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో యాదగిరేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమం ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జనుమూరి శ్రీనివాస్, పిఎంసి కమిటీ చైర్మన్ సిద్దా దుర్గాదేవి, తల్లిదండ్రులు యాట్ల లోవకుమారి, బొబ్బిలి రమణమ్మ, కోచ్చ వరలక్ష్మి, బచ్చలి రమణకుమారి, జెఎస్ రెడ్డి, ఆర్ అచ్చిరాజు, సిహెచ్ వెంకటగిరి, టి దుర్గబాబు, యాట్ల గిరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు

టిడిపిలో కుమ్ములాటలు

- పార్టీ మండల అధ్యక్షుని ఎన్నికపై గుర్రు
- గిడ్డి ఈశ్వరి వైఖరి మార్చుకోకపోతే 300 మంది రాజీనామా చేస్తామని హెచ్చరిక

గిడ్డి ఈశ్వరి వైఖరిని వ్యతిరేకిస్తున్న టిడిపి నాయకులు వీరే..

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని తెలుగుదేశం పార్టీలో కుమ్ములాటలు మొదలయ్యాయి. పార్టీ మండల అధ్యక్షుని ఎన్నిక విషయంలో టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి ఏకపక్షంగా వ్యవహరిస్తూ మెజార్టీ ఓట్లు వచ్చిన వ్యక్తిని కాదని, తన అనుచరుడికి అధ్యక్ష పదవి కట్టబెట్టడంపై గుర్రుగా ఉన్నారు. గిడ్డి ఈశ్వరి తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే 300 మంది రాజీనామా చేస్తామని సోమవారం ఆ పార్టీ నాయకులు ప్రకటించారు.

ఈనెల 12న తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఎన్నిక జరిగింది. ముందు కాకూరు చంద్రావు రావు, గొలిసింగి సత్యనారాయణ, సుమర్ల సాంబశివ పోటీ పడగా, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి గొలిసింగి సత్యనారాయణ పోటీ నుండి తప్పుకున్నాడు. దీంతో కాకూరు చంద్రావురావు, సుమర్ల సాంబశివ మధ్య పోటీ జరిగింది. నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, శెట్టి బాబూరావు, ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి సమక్షంలో ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో టిడిపి మండల అధ్యక్షునిగా కాకూరు చంద్రరావు 8 ఓట్ల మెజారిటీతో గెలిపొందగా, చంద్రావు గెలుపును ప్రకటించకుండా గిడ్డి ఈశ్వరి, తన అనుచరుడు సుమర్ల సాంబశివను మండలాధ్యక్షుడుగా ప్రకటించినట్లు టిడిపి కార్యకర్తలు సోమవారం ఆరోపించారు. గిడ్డి ఈశ్వరి వైఖరిపై నియోజకవర్గంలోని ఐదు మండలాల కార్యకర్తలు, నాయకులు అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు.

కొయ్యూరులో సుమారు 300 మంది ప్రధాన నాయకులు, కార్యకర్తలు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు టిడిపి నాయకులు గొలుసింగి సత్యనారాయణ, కొర్రు రామ్మూర్తి, సర్పంచ్ బాలరాజు, యలమంచిలి వరహాలుబాబు, ఎస్‌కె.ఖాన్ ఖాన్, కాకూరు చంద్రావు, కిముడు శ్రీరాములు, కే.భాస్కరరావు, సురబోయిన చిన్ని, వనగల స్వామి నాయుడు, బండేని సన్యాసిరావు, మారా మచ్చ కొండ, సాలెపు సన్యాసిరావు, జన్ని రాజబాబు, యాళ్ల నాగేష్, జోగినాయుడు, పాంగి రాజుబాబు, కొర్రు పులయ్య, పి.ప్రసాద్, చింతలపూడి మురళి, నడింపాలెం కృష్ణ తదితరులు సోమవారం ప్రకటించారు. టిడిపి మీద అభిమానం, చంద్రబాబుపై నమ్మకంతో తామంతా పార్టీలో పనిచేస్తున్నామని, తమకు పార్టీ మీద కోపంగాని, ద్వేషం గాని లేదని పేర్కొన్నారు. గిడ్డి ఈశ్వరి నాయకత్వం మీద తమకు నమ్మకం లేదని, నియోజకవర్గ ఇన్‌ఛార్జిని మార్చితే తప్ప పార్టీకి మనుగడ ఉండదని చెప్పారు. పార్టీ మండల అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన కాకూరు చంద్రావుని పార్టీ మండల అధ్యక్షుడుగా ప్రకటించాలని, లేకుంటే రాజీనామాకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

రేపు తునికాకు కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-చింతూరు : ఏప్రిల్, మే నెలలో తునికాకు సేకరించిన కార్మికులకు డబ్బులు చెల్లించాలని కోరుతూ చింతూరు ఐటీడీఏ ముందు బుధవారం ధర్నా జరుగుతుందని, దీనికి తునికాకు కార్మికులందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు చింతూరులో సోమవారం జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎర్రని ఎండలో పాములు, తేళ్ల వంటివి చూడకుండా తునికాకు కార్మికులు తమ పొట్టకూటి కోసం ఆకు సేకరించి ఇస్తే నేటికీ వారికి డబ్బులు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. తునికాకు కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యం దేనికని ప్రశ్నించారు. కార్మికుల పట్ల నిర్లక్ష్యంతో వ్యవహరిస్తూ చూస్తూ ఊరుకునేది లేదనిఇ హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కాక అర్జున్ దొర, దిలీప్, పూనెం ప్రదీప్ కుమార్, కారం నాగేష్, మొట్టుం రాజయ్య, బాబు బొర్రయ్య, ఇర్ప అజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పులి సంతోష్‌కుమార్

నేటికీ తెరుచుకోని పాఠశాల

• టీచర్ కోసం విద్యార్థుల ఎదురుచూపులు

టీచర్ కోసం ఎదురుచూస్తున్న ఎగువశోభ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి -అనంతగిరి: నేటికీ పాఠశాల తెరుసుకోక పోవడంతో విద్యార్థులంతా నిరాశనతో ప్రతి రోజూ నిరాశతో ఎదురు చూస్తున్నారు. మండలానికి మారుమూల పైనంపాడు పంచాయతీ ఎగువశోభ ప్రాథమిక పాఠశాల నేటికీ నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఉపాధ్యాయుడిని నియమించ లేదు.దీంతో విద్యార్థులు కనీసం అక్షరాలు నేర్చుకోలేని పరిస్థితిలో ఉన్నారు. ఆటపాటలు ఆడుతూ, తల్లిదండ్రులతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన పరిస్థితి ఏర్పడింది.

ఈ పాఠశాలలో పైనంపాడు, దిగువసొనభ, దుర్గం .ఎగువసొనభ. గ్రామాలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు పైగా చదువుతున్నారు. ఐదో తరగతి పూర్తి చేసుకుని ఆరో తరగతిలో వేరే పాఠశాలలో జాయినింగ్ అయ్యే విద్యార్థులకు నేటికీ టీసిలు ఇవ్వకపోవడంతో ఇంటి వద్ద ఉండిపోయిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి రెగ్యులర్ ఉపాధ్యాయుడుతో పాటు బాష వాలంటరీలను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. వారం రోజు లోపు టీచర్‌ను నియమించకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద విద్యార్థులతో ఆందోళన కార్యక్రమం చేపడతామని తల్లిదండ్రులు హెచ్చరించారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన నిరసన

డిఆర్ఒకు వినతిపత్రం ఇస్తున్న ఎఐఎస్ఎఫ్ నేతలు

ప్రజాశక్తి -పాడేరు: పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియాంబర్స్మెంట్ బకాయి సొమ్ము తక్షణమే విడుదల చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం పాడేరులో విద్యార్థులు ర్యాలీ, ధర్నా చేశారు. అనంతరం డి.ఆర్.ఓ.కి సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ మాట్లాడుతూ, ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో ఎంతో మంది పేద గిరిజన విద్యార్థులు ప్రభుత్వం ఇచ్చే స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ పై ఆధార పడి చదువుకుంటున్నారన్నారు. ఇంతకు ముందు స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ వచ్చేవని, . విద్యార్థులు ఏ ఇబ్బందులు లేకుండా చదువుకునే వారన్నారు. ప్రస్తుతం కాలేజీలకు ఫీజులు కట్టుకోలేక, టి.సి.లు తీసుకోలేక ఉన్నత చదువుకోలేక చదువును మధ్యలోనే ఆపేసి నిరుద్యోగులుగా మారి పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వి.కృష్ణ, సహాయ కార్యదర్శి తనీష్, నాయకులు బాలరాజు పాల్గొన్నారు

విద్య, వైద్యానికి కార్యాచరణ ప్రణాళిక

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని 420 గ్రామ సచివాలయాల పరిధిలో ఆది కర్మయోగి ప్రోగ్రాం అమలు చేయడానికి సమగ్రమైన కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సు హాలులో పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఐసిడిస్, డిఆర్‌డిఏ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో పి.ఎం. జన్.మన్ పథకాలు అమలు, ఆది కర్మయోగి ప్రోగాంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లైట్ హౌస్ విధానానికి రూప కల్పన చేయాలన్నారు. దీని ద్వారా విద్య వైద్యం ఆరోగ్యం, అంగన్వాడీ సేవలు సక్రమంగా అందించడానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. యువతకు శిక్షణలు, సామర్థ్యాలు పెంపు, ఇంటర్నెట్ సదుపాయాలు వంటి కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, జిల్లా వ్యవసాయా ధికారి ఎస్ బి ఎస్ నంద్, జిల్లా ఉద్యానవన అధికారి ఎ.రమేష్ కుమార్రావు, డిఆర్‌డిఏ పిడి వి.మురళి, డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్.బి. ఎస్.సంద్, పంచాయతీ రాజ్ ఇఇ టి.కొండయ్యపడాల్, జిల్లా వైద్యా ఆరోగ్యశాఖాధికారి టి.విశ్వేశ్వరనాయడు ఎ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

పథకాల పనులను వేగంగా పూర్తి చేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల కార్యదర్శి విభు నాయర్ సూచించారు. సోమవారం డిల్లీ నుండి అల్లూరి జిల్లాలో జరుగుతున్న పథకాల పురోగతిపై సమీక్షించారు. అంగన్వాడీ భవనాలు, గృహ నిర్మాణాలు, జల్ జీవన్ మిషన్‌లో చేపట్టిన తాగునీటి పథకాలు, రహదారుల నిర్మాణాలు, బహుళార్థక భవన నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. దీనిపై జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ పి ఎం జి ఎస్ పై మొదట దశలో 85 రోడ్లు మంజూరయ్యాయని 43 పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. రెండవ దశలో 61 పనులు మంజూరు కాగా 21 పనులు టెండర్ దశలో ఉన్నట్లు వివరించారు. 118 అంగన్వాడి భవనాలు 53 హాస్టల్ భవనాలు మంజూరైనట్లు తెలిపారు. ఈ అభివద్ధి పనులన్నిటిని నవంబర్ నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ తెలియజేశారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

• 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో జిసిసి చైర్మన్ శ్రావణ్ కుమార్

ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి-అరకులోయ: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. అరకు వేలి మండలం పద్మపురం పంచాయతీ పద్మపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, టీడీపీ నాయకులు కలిసి గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రజలను కలిసి వారి కష్టసుఖాలు, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాలను అడిగారు. భవిష్యత్తులో చేపట్టబోయే పనులు గురించి ప్రజల నుండి సమాచారం సేకరించారు.

గత ఏడాది కాలంలో పెన్షన్ పెంపు, తల్లికి వందనం, గ్యాస్ సబ్సిడీ, అన్నా క్యాంటీన్, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, సన్న బియ్యం పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే మరిన్ని ప్రభుత్వ పథకాలు అమలు చేయనున్నట్లు రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, అరకులోయ మండల టిడిపి అధ్యక్షుడు మహాదేవ్ బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, శోభకోట సర్పంచ్ పలాసి శశి భూషణం నాయుడు, స్థానిక సూపర్ ఎంపీటీసీ కిల్లో సాయిరాం, మాజీ వైస్ ఎంపీపీ అమ్మన్న అసెంబ్లీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి రమేష్ మాజీ సర్పంచ్ మహాదేవ్ టీడీపీ మహిళా నాయకు రాలు కళావతి పాల్గొన్నారు.

ప్రజా కళాకారులకు ఘన సత్కారం

ప్రజాశక్తి- ఉక్కునగరం : ఉద్యోగ విరమణ పొందిన కళాకారులు కె.సింహాచలం, కె.సత్యనారాయణ, వైటి.దాస్‌లను ప్రజానాట్యమండలి, స్టీల్‌డివిజన్ ఆధ్వర్యంలో ఆర్.కృష్ణార్జున అధ్యక్షతన సోమవారం ఘనంగా సత్కరించారు. యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 78వ వార్డ్ కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ,ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మరింత బలోపేతంగా పోరాడాల్సిన అవసరం నేటి యువతరంపై ఉందని గుర్తు చేశారు. భవిష్యత్తులో యువతరానికి ఉద్యోగ అవకాశాలు రావాలంటే కచ్చితంగా స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వానికి ప్రజలు కట్టిన పన్నులతో ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్ ముమ్మాటికీ ప్రజల ఆస్థేనని, ఇది ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగితేనే రిజర్వేషన్లు అమలై, అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు

తహశీల్దార్‌గా త్రివేణి

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: మండల తహసీల్దార్ గా త్రివేణి బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో చీడికాడ మండలంలో తహసీల్దార్‌గా పని చేశారు. బదిలీలో భాగంగా మండల తహసీల్దార్ గా వచ్చారు. ఇన్చార్జి తహసీల్దార్ గా పని చేసిన ముజీబ్ అనకాపల్లి జిల్లా బదిలీ అయ్యారు. గిరిజన ప్రజానికానికి మెరుగైన సేవలను కల్పించి, భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ రాము, సీనియర్ అసిస్టెంటు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సమిష్టి కృషి

• ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్

మాట్లాడుతున్న ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్

ప్రజాశక్తి -సీతమ్మధార : ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లను విస్తృతంగా ఏర్పాటు చేయాలని ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. సోమవారం నగరంలోని సంస్థ సర్కిల్ కార్యాలయంలో సోలార్ ఏజెన్సీలు, బ్యాంకులు, విద్యుత్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. సోలార్‌ప్లాంట్ల ఏర్పాటులో ముందున్న వెండర్లు, అధికారులను అభినందించారు.

ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని వార్డులు, గ్రామ పంచాయతీల్లో సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు ప్రత్యేక అవగాహన నిర్వహించి, సోలార్‌వెండర్లు, అధికారులు సమన్వయంతో లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. పిఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజనపై ప్రజలకు అవగాహన ద్వారా రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అద్భుతమైన స్పందన లభిస్తున్నప్పటికీ, నగరంలో 200 అంతకంటే ఎక్కువ యూనిట్లు విద్యుత్ వినియోగిస్తున్న లక్ష 83 వేలకుపైగా వినియోగదారుల్లో కేవలం 2200 మాత్రమే ఏర్పాటు చేసారని, దీనిలో మరింత పురోగతి సాధించాలని అధికారులను ఆదేశించారు. సిరిపురం, సీతమ్మధార, ఎంవిపి కాలనీ, మద్రిపాలెం, కంచరపాలెం, ఎన్ఎస్‌టిఎల్, మధురవాడ, ఎండాడ, గోపాలపట్నం, గాజువాక వంటి ప్రాంతాల్లో సామర్థ్యానికి తగిన విధంగా రూఫ్‌టాప్ ప్లాంట్ల ఏర్పాటుకు అధికారులు చొరవ చూపలేదన్నారు. అపార్టమెంట్ల కామన్ సర్వీసులకు రూఫ్ టాప్ కచ్చితంగా ఏర్పాటు చేయించడంతో పాటు, వర్చువల్ నెట్ మీటరింగ్ పద్ధతిలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై దష్టి కేంద్రీకరించాలని సూచించారు.అతి తక్కువ వడ్డీకి బ్యాంకుల నుంచి రుణాలను తీసుకొని సోలార్ ప్లాంట్ల ఏర్పాటు చేసుకొనేలా వినియోగదారులకు బ్యాంక్ అధికారుల ద్వారా పెద్దఎత్తున అవగాహన కల్పించాలన్నారు.

బ్యాంకు రుణాలతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు చేసే వినియోగదారుల నుంచి రుణవాయిదాలను ఇఎంఐ పద్ధతిలో బ్యాంకుల తరుపున వసూలు చేసేందుకు ఇపిడిసిఎల్ సిద్దంగా ఉందని బ్యాంకులకు సీఎండి భరోసా ఇచ్చారు. కిలోవాట్ సామర్థ్యంగల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.30వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు గరిష్టంగా రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని, బిసి లకు అదనంగా రూ.20 వేల రాయితీ ఉంటుందన్నారు. బ్యాంకుల నుంచి ఏడుశాతం వడ్డీతో 90 శాతం రుణం పొందవచ్చన్నారు సోలార్‌ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి జరిగి, వాడుకోగా మిగిలిన అదనపు విద్యుత్‌ను విద్యుత్ సంస్థకు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చన్నారు.అపార్టమెంట్లపై సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం లేని వారికి వర్చువల్ నెట్ మీటరింగ్ పద్ధతిన వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు.కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ టివి సూర్యప్రకాష్, సీజీఎం బిసులేఖరాణి, ఎస్ఇ జి శ్యాంబాబు, ఎస్‌బిఐ లీడ్ మేనేజర్ శ్రీనివాస్, ఎపిజివిబి రీజినల్ మేనేజర్ చిరంజీవి పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

క్షయ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-అడ్డతీగల : స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం టిబి యూనిట్ ఎస్‌టిఎస్ జి.లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. హాస్పిటల్ కౌన్సిలర్ నారే వాసు టిబి ఎలా వస్తుంది, దేని వల్ల వస్తుంది, నివారణకు గల మార్గాలను వివరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పండ సతీష్ మాట్లాడుతు తమ ఆసుపత్రిలో వివిధ వైద్య సేవలు ఇప్పుడు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ఎవరికైనా వారంపైబడి దగ్గు ఉంటే పరీక్షలు చేసి పాజిటివ్ వచ్చినట్లయితే మందులు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఊహ, సునీత, కళ్యాణ్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని ఎర్రంరెడ్డి నగరంలో సోమవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామానికి మంచి పాలన, ప్రతి ఇంటికీ సంక్షేమం తీసుకెళ్లాలన్నదే చంద్రబాబు సంకల్పమని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, మండల పరిశీలకులు అప్పన రమేష్, కారం సురేష్ బాబు, పెంటపాటి అనంత మోహన్, సలాది బాపిరాజు, అడబాల బాపిరాజు, కారం సింహాచలం, వై నిరంజనీదేవి, బాపన్న దొర, సిద్దా వెంకన్న, పండా బాబీ, పత్తివాడ రమణ, సంకురు పెంటమ్మ, దిండి జనార్ధన్, ఎస్‌కె చోటు, ఫోటోజి సురేష్, కారు లక్ష్మి, ఎడ్ల పోసి బాబు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఎంఇఒను నియమించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : విఆర్.పురం మండలానికి రెగ్యులర్ ఎంఇఒను నియమించాలని ఎంపిపి కారం లక్ష్మి డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తాత్కాలిక ఎంఈఓ సక్రమంగా విధులు నిర్వహించడం లేదని, తాను రెండు మూడు సార్లు సందర్శించినా ఎప్పుడూ కార్యాలయంలో ఉండడం లేదని పేర్కొన్నారు. తాత్కాలిక ఎంఈఓ విధులు సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల విద్యా వ్యవస్థ కుంటుపడుతుందని, తక్షణమే రెగ్యులర్ ఎంఈఓను నియమించాలని కోరారు. మండలంలోని పలు పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు ఒకే ఉపాధ్యాయుడు పాఠాలు చెప్పడంతో విద్యార్థులకు విద్య సక్రమంగా అందడం లేదని తెలిపారు. చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులను ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో మాట్లాడి వారిని బడిలో చేర్చాలని, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఎంపిపి కారం లక్ష్మి డిమాండ్ చేశారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలని, అది మాత్రమే ప్లాంట్ పరిరక్షణకు పరిష్కారమని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరం సోమవారానికి 1572వ రోజుకు చేరుకుంది. సిఐటియు జగదాంబ జోన్ కార్యకర్తలు దీక్షల్లో కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా చూస్తామని హామీ ఇచ్చిన టిడిపి, జనసేన నాయకులు ఇప్పుడు మాట మార్చారని మండిపడ్డారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కె.చంద్రశేఖర్, నాయకులు కె.నర్సింగరావు, ఎర్రి బాబు, చంద్రమౌళి, నాగరాజు పాల్గొన్నారు.

ఎస్‌టి రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పక పాటించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అన్ని ప్రభుత్వ శాఖలు, విశ్వవిద్యాలయాలతో పాటు ప్రైవేటు సంస్థల్లో నియామకాలు నిర్వహించే సందర్భంగా ఎస్‌టి రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి.శంకరరావు పేర్కొన్నారు. ఒకరోజు పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం విశాఖకు ఆయన చేరుకున్నారు. ఆంధ్ర యూనివర్సిటీ ఎస్‌టి ఉద్యోగుల సంఘ సభ్యులతో సమావేశమయ్యారు. వర్సిటీలో ఎస్‌టి ఉద్యోగుల నియామకంలో రిజర్వేషన్ల అమలును, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఉద్యోగుల రోస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీలో ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకాలలో ఎస్‌టి రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పక పాటించాలని తెలిపారు. తాను కూడా గతంలో ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థినేనని అన్నారు. ఎస్‌టి విద్యార్థులు ఉన్నత స్థితిలోకి వెళ్లేందుకు ఎయులో చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

అనంతరం ఎయులో చదువుతున్న ఎస్‌టి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. చదువుకునే క్రమంలో ఎదుర్కొంటున్న సమస్యలను, వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే ఉన్నత చదువులకు వచ్చే ఎస్‌టి విద్యార్థినుల శాతం పెరిగిందని అన్నారు. ఇది శుభ పరిణామమని తెలిపారు. అంబేద్కర్ చెప్పినట్లు విద్యను ఒక ఆయుధంగా ఉపయోగించుకోవాలని, అందులో భాగంగానే ఇప్పుడు పెరిగిన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎయు రిజిస్ట్రార్ ధనుంజయరావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎల్.మంజుల, నోడల్ ఆఫీసర్ జె.అప్పారావు, ఎయు ఉద్యోగుల లైజన్ అధికారి కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎయులోని ఎస్‌టి ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంటున్న శంకరరావు

జిసిసిని పటిష్టపరిచే దిశగా సిఫార్సులు

విశాఖలోని జిసిసి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించిన డివిజి.శంకరరావు పలు సూచనలు చేశారు. తొలుత గిరిజన సంక్షేమం కోసం జిసిసి చేపడుతున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిఎం (అడ్మిన్) జి.సంధ్యారాణి వివరించారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ మార్కెట్లో అరకు కాఫీకున్న ప్రాధాన్యతల దృష్ట్యా అమలు చేస్తున్న చర్యలు, అభివృద్ధికి తీసుకోవలసిన జాగ్రత్తలపై సీనియర్ మేనేజర్ (కాఫీ) టి.శ్రీనివాసరావుకు తగు సూచనలు చేశారు. జిసిసి ద్వారా చేపడుతున్న నూతన ప్రాజెక్టులు, భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో ఉత్పత్తులు నిల్వ ఉంచేందుకు కోల్డ్ స్టోరేజీలు, గొడౌన్ల నిర్మాణానికి, సిబ్బంది నియామకానికి ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ ఎంవివిఎస్.ఉమాదేవి, జిఎం ఫైనాన్స్ నిర్మలమ్మ, జిఎం మార్కెటింగ్ త్రినాధరావు, డిజిఎం (డిఆర్ఎస్) సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో కిడ్నీ మార్పిడి విజయవంతం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో కిడ్నీ మార్పిడి అధునిక పద్ధతిలో విజయవంతమైంది. ఈ విషయాన్ని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి సోమవారం మీడియాకు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. 39 సంవత్సరాల పి.లక్ష్మి దీర్ఘకాలిక కిడ్నీ సమస్యతో కెజిహెచ్ నెఫ్రాలజీ విభాగంలో డయాలసిస్ చేయించుకుంటోంది. కిడ్నీ దానం చేసేందుకు ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో నెఫ్రాలజీ, యురాలజీ, ఎనస్తీషియా విభాగాలలో వివిధ పరీక్షలు నిర్వహించి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సను కెజిహెచ్‌లో విజయవంతంగా నిర్వహించారు. దాతకు ఆధునిక పద్ధతిలో లేప్రోస్కోపిక్ విధానంలో శస్త్ర చికిత్స నిర్వహించామని, దీంతో దాత తక్కువ సమయంలో కోలుకుని సోమవారం డిశ్చార్జి అయ్యారని సూపరింటెండెంట్ వాణి తెలిపారు. ఈ క్లిష్టమైన కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆపరేషన్లు కెజిహెచ్‌లో బాగా జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ చికిత్సలో పాల్గొన్న డాక్టర్లును, వివిధ విభాగాలకు చెందిన సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా దాత లక్ష్మిని అభినందించి సత్కరించారు. ఈ శస్త్ర చికిత్సలో కెజిహెచ్ నెఫ్రాలజీ ఇంచార్జి విభాగాధిపతి డాక్టర్ డి.రాధాకృష్ణన్, డాక్టర్ రత్నప్రభ, డాక్టర్ సింధూర్, డాక్టర్ నాగబాబు, డాక్టర్ నిషాకుమారి, డాక్టర్ జయశ్రీలక్ష్మి, డాక్టర్ దివ్య, డాక్టర్ సంతోష్, యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.చంద్రశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ దిలీప్, డాక్టర్ ఫాతిమా, డాక్టర్ వెంకటకృష్ణ, ఎనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ వి.రవి, డాక్టర్ కె.శ్రీలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బి.సూర్య ప్రకాష్, అలాగే నర్సింగ్ సిబ్బంది భారతి, రాజేశ్వరి, కృప, పండయ్య పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్ శిక్షణా కేంద్రాన్ని కొనసాగించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పాండురంగాపురం ఇండోర్ స్టేడియంలోని జిమ్నాస్టిక్స్ స్పెషల్ బెడ్ శిక్షణా కేంద్రాన్ని మల్టీ స్పోర్ట్ కాంప్లెక్స్‌గా మార్చాలనే ప్రతిపాదనకు విరమించుకోవాలని వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. విశాఖపట్నంలో రెండు దశాబ్దాలుగా పిల్లల శారీరక అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలిచిన జిమ్నాస్టిక్స్ సెంటర్‌ను కొనసాగించాలన్న తలిదండ్రుల డిమాండ్‌ను వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ పూర్తిగా సమర్థిస్తోందని పేర్కొన్నారు. ఈ జిమ్నాస్టిక్స్ సెంటర్ అనేక మంది చిన్నారులకు శిక్షణ ఇచ్చి జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయికి అథ్లెట్లను తయారు చేసిందన్నారు. ఇటువంటి ప్రత్యేక ఆట కోసం వున్న కేంద్రాన్ని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా మార్చడం ద్వారా దానికి అవసరమైన స్థలం ప్రాధాన్యత కుంటుపడుతుందన్నారు. నగరంలోని ప్రభుత్వ స్థలాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు కట్టి వాటిని ప్రభుత్వమే నిర్వహించి ఉచితంగా అన్ని రకాల ఆటలకు శిక్షణ ఇవ్వడం ద్వారా వేలాదిమంది క్రీడాకారులు తయారవుతారని తెలిపారు. విశాఖ నగర బాలల అవసరాలరీత్యా ఈ సెంటర్‌ను కేవలం జిమ్నాస్టిక్స్ కోసం మాత్రమే కొనసాగించేలా ప్రభుత్వ చర్యలు ఉండాలన్నారు.

ప్రజల సమస్యలను వింటున్న పిఒ కట్టా సింహాచలం, తదితరులు

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 94 అర్జీలు

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమానికి ప్రజల నుండి 94 అర్జీలు అందాయి. ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, ఏపీఓ డివిన్వి.రమణ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, అడిషనల్ డిఎంహెచ్వో జి.శిరీష, డిఎల్‌డిఓ కె.కోటేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, డిఎల్‌పిఓ నరసింహారావు, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏడిఏలు సిహెచ్‌కేవీ.చౌదరి, కె. సావిత్రి, ఉపాధి హామీ ఏపీడి బి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గాబ్రియేలు, ఐ.శ్రీనివాసరావు, సుబ్బయ్య, వెలుగు ఏపిడి దేగలయ్య, పిఏఓ ఎల్.రాంబాబు, పీహెచ్ఓ దేవదానం, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి యం.సావిత్రి, తహశీల్దారు బాలాజీ, ఎంపీడీవో పి.జయంతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.వెంకటరమణ, రామచంద్రమూర్తి, మల్లికార్జున రావు, సుబ్బారావు, డిఎంఓ విజ్ఞానశ్రీ, డిటిలు శ్రీధర్, త్రిమూర్తులు, సూపరింటెండెంట్ బి.కిషోర్ పాల్గొన్నారు.

నేటి పోలవరం నిర్వాసితుల సదస్సుకు తరలిరండి

ప్రజాశక్తి-దేవీపట్నం : దేవీపట్నం మండలంలోని పోలవరం నిర్వాసితుల సమస్యల పరిస్కారానికై మండలంలోని మంటూరు పునరావాస కాలనీలో మంగళవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం రంపచోడవరం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు దేవీపట్నం మండలంలో ఉన్న నిర్వాసితులందరూ పెద్ద ఎత్తున వచ్చి తమ సమస్యలను తెలియజేయాలని ఆమె కోరారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

ప్రజాశక్తి-అడ్డతీగల : మండల కేంద్రంలో దుశ్చర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యను హత్య కేసులో నిందితుడైన భర్తను వేటమామిడి సెంటర్లో అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. సిఐ బి.నరసింహమూర్తి తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని వంగలమడుగు గ్రామానికి చెందిన మడకం జోగి దొర తన భార్య మడకం విజయ కుమారిపై అనుమానంతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో భార్యను హతమార్చడం కోసం ఈ నెల 9న రాత్రి 9 గంటల సమయంలో తన పొలంలో ఉన్న మకాం వద్ద తన భార్యతో కావాలనే గొడవ పెట్టుకున్నారు. ఈ సమయంలో కర్రతో కొట్టి, కత్తితో తలపై నరికి హత్య చేశాడు. అనంతరం తన భార్య శవాన్ని మంచం మీద పడుకోబెట్టి, ఆ రాత్రికి అదే ఇంట్లో నిద్రపోయి, మరునాడు ఉదయం పారిపోయాడు. దీనిపై దుశ్చర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు అడ్డతీగల సిఐ బి.నరసింహమూర్తికి ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ ఎస్.వెంకయ్య, సిబ్బందితో వెళ్లి వేటమామిడి సెంటర్లో నిందితుడు మడకం జోగి దొరను అరెస్టు చేశారు. ఆయన వద్ద నుండి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు తరలించారు.

శ్రీహరిపురం ఆసుపత్రిని ప్రభుత్వమే నడపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రీహరిపురంలోని జివిఎంసి ఫస్ట్ రిఫరల్ యూనిట్ (ఎఫ్ఆర్‌యు) ఆసుపత్రిని ప్రభుత్వమే నడపాలని, ప్రైవేటు ప్రతిపాదనలు విరమించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట, అనంతరం జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు, జివిఎంసి కమిషనర్‌కు పార్టీ తరఫున వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.